క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



కంకిపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కంకిపాడు పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నేత షేక్ హుస్సేన్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. అలాగే నాలుగో వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న పైడిపల్లి చంద్రను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తంబాబత్తుల ఓంకారం, కరీముల్లా, రాఘవ, దండుగుల రవి, రమణమ్మ, టీ మరియబాబు, ఇతర నేతలు ఉన్నారు.

అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు తవ్వా కుటుంబరావు, లక్ష్మి సుజాత దంపతుల సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల ప్రణాళికపై సమీక్ష

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహత్మ గాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనుల ప్రణాళికపై మంగళవారం సమీక్ష నిర్వహించినట్లు ఎంపీడీవో కే జోగేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై చర్చించినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.90 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.25 లక్షలతో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై సభ్యుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించామని వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బ్లాక్ లెవల్ డెవలప్‌మెంట్ ప్లాన్ రూపకల్పన చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాన్ని తొలగించడం దారుణం

పెనమలూరు: యనమలకుదురులో ప్రయాణికుల దాహం తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పేర్కొన్నారు. కానూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ చలివేంద్రం ఏర్పాటు చేస్తే తాను ప్రారంభించాననే కక్షతో నేటమట్టం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్, తాడిగడప కమిషనర్ కనుసన్నల్లో అక్రమ లేఅవుట్లు, అనధికార భవనాల నిర్మాణం జరుగుతోందని ఆరోపించారు. కానూరులో టీడీపీ నాయకుడు అక్రమ కట్టడం చేస్తుంటే అడ్డుకోబోయిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యం చేస్తే కమిషనర్ ఏమి చేస్తున్నాడని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో వంశీ అనుచరుడు రంగా

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అనుచరుడైన ఓలుపల్లి మోహన్ రంగాను మంగళవారం గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో రంగాను పోలీసులు ఏ1 నిందితుడిగా చేర్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మాజీ వంశీమోహన్‌తో పాటు ఆయన అనుచరుడైన రంగాను ప్రధానంగా టార్గెట్ చేశారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్‌కు పాల్పడ్డారంటూ పటమట పీఎస్‌లో కేసు, గన్నవరం పీఎస్‌లో నాలుగు, ఆత్కూరు, వీరవల్లి పీఎస్‌ల్లో ఒక్కొక్క కేసు చొప్పున కొత్తగా రంగాపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతంలోకి వెళ్లిన రంగాను రాజమండ్రి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆయనను గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీస్ అధికారులు రంగాను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రంగాను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులతో పాటు న్యాయవాదులను కూడా పోలీసులు అనుమతించలేదు. పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రుణాల కోసం 1,722 దరఖాస్తులు

విజయవాడరూరల్: ప్రభుత్వం 2024-25వ సంవత్సరానికి గాను వెనుకబడిన తరగతులు, కాపు, కమ్మ కార్పొరేషన్ల ద్వారా అందించనున్న రుణాల కోసం 1,722 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓపీ మురళీకృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

జంక్షన్.. టెన్షన్



సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్న కల్వర్టు ప్రాంతం

- నెప్పల్లి- చలివేంద్రపాలెం జంక్షన్ వద్ద రోజూ టెన్షన్
- నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పెరుగుతున్న ప్రమాదాలు
- సమస్యపై వినతులు ఇచ్చిన స్థానికులు
- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

కంకిపాడు: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి మార్గం. గ్రామాల నుంచి నేరుగా హైవేపైకి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. హైవేపై వెళ్లే వాహనాలు కనిపించకుండా అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు. వెరసి నిత్యం టెన్షన్ వాతావరణం. ఇది నెప్పల్లి- చలివేంద్రపాలెం కూడలి వద్ద పరిస్థితి. ఇక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాద వార్త వినాల్సి వస్తుందోనన్న భయంతో వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు.

పదికి పైగా ప్రమాదాలు..

గడిచిన ఏడాది కాలంలో ఈ కూడలిలో పదికి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో సుమారు 20 మందికిపైగా గాయపడినట్లు సమాచారం. చిన్న చిన్న ప్రమాదాలు అయితే లెక్కలేదు. నెప్పల్లి, చలివేంద్రపాలెం గ్రామాల నుంచి వాహనదారులు హైవే ఎక్కగానే అటు విజయవాడ వైపు, ఇటు మచిలీపట్నం వైపు వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు నిత్యకృత్యం అవుతున్నాయి. ప్రధానంగా హైవేపై రాకపోకలు సాగించే వాహనాలు కనిపించకుండా రోడ్డు మార్జిన్‌లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ కూడళ్లలో ఆటోలు, బస్సులు ప్రయాణికుల కోసం నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాల సంఖ్య అధికం అవుతోంది.

ఎన్‌హెచ్ అధికారులకు వినతి..

కూడలిలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, ఫ్లెక్సీలతో పడుతున్న అగచాట్లుపై ఇక్కడి పరిసర గ్రామాల ప్రజలు సంతకాలు సేకరించి రెండు నెలల క్రితం జాతీయ రహదారుల శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. అయితే నేటికీ వారిలో స్పందనలేదు.

ఇలా చేస్తే మేలు..

- హైవేపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తొలగించాలి. రోడ్డు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసేలా జాతీయ రహదారుల శాఖ చర్యలు తీసుకోవాలి.
- ప్రధాన సెంటరులోనే ఆటోలు, బస్సులు ప్రయాణికుల కోసం నిలుపుదల చేయకుండా 50 అడుగుల దూరంలో బస్సు షెల్టరు ప్రదేశాన్ని నిర్దేశించాలి.
- జాతీయ రహదారిపై వాహన వేగాన్ని నియంత్రించేలా ఇండికేటర్లు ఏర్పాటు చేయాలి.
- కూడలికి ఇరువైపులా కల్వర్టు రక్షణ గోడలు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేసి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తే ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గుతుంది.



విజయవాడ- మచిలీపట్నం హైవేపై నెప్పల్లి- చలివేంద్రపాలెం కూడలి

నిత్యం.. భయం భయంగా..

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో నెప్పల్లి- చలివేంద్రపాలెం కూడలి ఒకటి. నాలుగు రోడ్ల కూడలి కావడమే కాకుండా నెప్పల్లి, కుందేరు, కందలంపాడు నుంచి మానికొండ వద్ద గుడివాడ మార్గాన్ని కలిసే జెడ్పీ రోడ్డు మార్గం ఉంది. మరో వైపు చలివేంద్రపాలెం నుంచి పెద ఓగిరాల, తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాలకు అనుబంధ రహదారి ఉంది. ఏటిపాయల నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు కూడా ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో రాకపోకల రద్దీ అధికం. అయితే ఇక్కడకు రాగానే వాహనదారుల్లో టెన్షన్ మొదలవుతుంది.



హైవేపై వాహనాలు కనిపించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అధికారులు స్పందించాలి



నిత్యం విజయవాడ- మచిలీపట్నం హైవేపై రాకపోకలు సాగిస్తుంటాం. ఇక్కడ ప్రధాన సెంటరులో ఉన్న ప్రమాదకర పరిస్థితులు ఎక్కడా లేవు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. కానీ నేటికీ స్పందించలేదు. ప్రజల ప్రాణాలు గాలిలో దీపంగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – అవుతు సుబ్బారెడ్డి, చలివేంద్రపాలెం

ఐదు నెలలు మంచం మీదే..



నేను రోడ్డు దాటుతున్న సమయంలోనే వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఐదు నెలలు మంచం మీదే ఉన్నా. హైవే కావడంతో వాహనాల వేగం ఎక్కువగా ఉంటోంది. వాహనాల వేగం నియంత్రణ జరగాలి. పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలి. ఎన్‌హెచ్ అధికారులు సర్వీసు రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలి.
– కొల్లి చంద్రశేఖర్‌రెడ్డి, చలివేంద్రపాలెం

దాహం తీర్చే చలివేంద్రంపై దాష్టీకం

టీడీపీ నేతల ఆదేశాలతో తొలగింపు



చలివేంద్రాన్ని జేసీబీతో తొలగిస్తున్న పోలీసులు, అధికారులు

పెనమలూరు: యనమలకుదురులో ప్రయాణికుల దప్పిక తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం టీడీపీ నేతల ఆదేశాలతో మున్సిపాలిటీ అధికారులు పోలీసులతో దౌర్జన్యంగా తొలగించారు. వివరాల్లోకి వెళితే.. యనమలకుదురు కొండ వెనుక ప్రాంతంలో వేసవి సందర్భంగా ప్రయాణికుల దప్పిక తీర్చడానికి అభయహస్త సేవాసమితి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గత పది రోజుల క్రితం వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రారంభించారు. దీంతో టీడీపీ నేతల కన్ను చలివేంద్రంపై పడింది. వైఎస్సార్ సీపీ నేత ప్రారంభించాడన్న అక్కసుతో చలివేంద్రాన్ని తొలగించాలని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో రోడ్డు మార్జిన్‌లో చలివేంద్రం ఆక్రమించి పెట్టారని టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి దౌర్జన్యంగా చలివేంద్రాన్ని జేసీబీతో తొలగించారు. స్థానికులు అభ్యంతరం తెలిపినా వినకుండా చలివేంద్రంలో ఉన్న సామగ్రి ధ్వంసం చేశారు. పోలీసులు రెచ్చిపోయి నిర్వాహకులు ఆరేపల్లి ఈశ్వరరావును దూషించి అదుపులోకి తీసుకున్నారు. దప్పిక తీర్చే చలివేంద్రంపై కూడా టీడీపీ నేతలు రాజకీయం చేయడంతో స్థానికులు మండిపడుతున్నారు.

ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.50వేలు



పాతపాడు గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

విజయవాడరూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఉన్న వారు సొంతగా ఇల్లు నిర్మించుకోడానికి ప్రభుత్వం అదనంగా రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేయనుంది. ఈ మేరకు మంగళవారం గ్రామాల్లో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఏఎఫ్ఏ గృహ నిర్మాణం ఏ స్టేజీలో ఉందో నమోదు చేశారు. ప్రస్తుతం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అందజేస్తుందని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు. అయితే పెరిగిన మెటీరియల్స్ ధరలను బట్టి చూస్తే ప్రభుత్వం చేస్తున్న సాయం నామ మాత్రమేనని లబ్ధిదారులు అంటున్నారు. కాగా గతంలో విజయవాడ రూరల్ మండలంలో మొత్తం 10,491 మందికి వైఎస్సార్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం అందజేసింది.

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్

పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీ శివప్రసాద్‌యాదవ్ ఉపాధి పనుల వివరాలు తనిఖీ చేశారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు మండల పరిధిలో 558 పనులకుగాను రూ. 2,76,25,907 విలువ చేసే వివిధ పనులు చేసినట్లు గుర్తించారు. ఇందులో ఎన్‌ఆర్‌జీఎస్ పనులు 522కి గాను రూ. 1,36,73,855 మట్టి పనులు చేసి కూలీ చెల్లించారు. పంచాయతీ రాజ్ పనులు 29 చేయగా వాటికి రూ. 1,16,04,803, ఆర్‌డబ్ల్యూఎస్ పనులు 7కు గాను రూ. 23,47,249 సొమ్ము వెచ్చించారు. సామాజిక తనిఖీలో ఎంపీడీవో బండి ప్రణవి, విజిలెన్స్ అధికారి జే సురేష్, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏపీవో రాజు, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో వాసవ్య, హెచ్‌సీఎల్ ప్రతినిధులు

గన్నవరం: మహిళల ఆర్థికాభివృద్ధికి వాసవ్య మహిళా మండలితో కలిసి హెచ్‌సీఎల్ ఫౌండేషన్ చేయూతనందిస్తున్నట్లు హెచ్‌సీఎల్ టెక్నాలజీ అడ్మిన్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సహకారంతో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన టైలరింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లోనూ, విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారు కార్యాలయం పైకప్పును రూ. 6 లక్షలతో పునరుద్ధరించిన వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్‌కు తహసీల్దారు కే వెంకటశివయ్య కృతజ్ఞతలు తెలిపారు. వాసవ్య అధ్యక్షురాలు డాక్టర్ బీ కీర్తి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు జాషువా, బీ శ్రీనివాసులు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ ఎన్నికపై ఉత్కంఠ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు గ్రామ ఉపసర్పంచ్ పదవి ఎంపిక గురువారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. వార్డు సభ్యురాలు ఒంగూరు పుణ్యవతి ఇటీవల తన ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ఉపసర్పంచ్ పదవిని చేజిక్కించుకునేందుకు కూటమి నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపసర్పంచ్ పదవి రేసులో ముఖ్యంగా ఆరవ వార్డు సభ్యుడు అద్దెపల్లి సాంబశివనాగరాజు, 11వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్ పేర్లు వినబడుతున్నాయి. వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులు శ్రీనివాస్‌కు, కూటమి నాయకులు సాంబశివనాగరాజుకు మద్దతు పలుకుతున్నారు. మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్న ఈ పంచాయతీలో సర్పంచ్ ఓటుతో కలుపుకొని మొత్తం 21 ఓట్లు అవుతాయి. ఉపసర్పంచ్ ఎన్నికలో వార్డు సభ్యులు చేతులెత్తి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందిన వరి శ్రీదేవి తన ఓటును ఎవరికి వేస్తారన్నది గ్రామంలో చర్చనీయాంశమైంది. ఉపసర్పంచ్ ఎన్నికలో వార్డు సభ్యులు వేసిన ఓట్లు ఒకవేళ టై అయినట్లయితే సర్పంచ్‌కు మరో ఓటు వేసే అవకాశం ఉంటుంది.

పీవీపీ సిద్ధార్థలో సంగీత కచేరీ



శాస్త్రీయ సంగీతం ఆలపిస్తున్న సరస్వతి రాజగోపాలన్

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం కాలేజీలోని వాల్యు ఎడ్యూకేషన్ విభాగం ఆధ్వర్యాన సంగీత కచేరీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పిక్‌మేకే సంస్థకు ప్రతినిధి సరస్వతి రాజగోపాలన్ వీణా వాయిద్యం చేయగా, కల్లూరు శ్రీనివాస్ మృదంగం, హనుమంతరావు ఘటం వాయించారు. ఈ సందర్భంగా సరస్వతి రాజగోపాలన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ సంగీతం మరుగున పడుతున్నందున స్పిక్‌మేకే సంస్థ ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. కాలేజీ వాల్యూ సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ పద్మనాభరాజు మాట్లాడుతూ మన సంస్కృతి విలువలు విద్యార్థులకు తెలపడానికి, విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య కీర్తనలు, త్యాగరాయకృతులు ఆలపించారు. డాక్టర్ నిరంజన్‌కుమార్, డాక్టర్ సూర్యప్రసాద్, డాక్టర్ విజయానంద్, ఎం.రుద్రమదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినయ నృత్య భారతికి రూ.25 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో అభినయ నృత్య భారతి (ఏలూరు) సంస్థకు మంగళవారం రూ. 25 వేలు విరాళాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అందించారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న కోటేశ్వరరావు ఎందరికో ఆదర్శనీయులని అభినయ నృత్య భారతి నిర్వహకుడు హేమసుందర్ కొనియాడారు. మానవత సినీయర్ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, గూడపాటి జయరామచంద్రరావు, గంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, పాట్లూరి శేషాచలం, వేగిరెడ్డి సూర్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ, పాబోలు గణేష్ పాల్గొన్నారు.

పంట చేనుకు చీరల ప్రహరీ



ఇంటికి ప్రహరీ కట్టినట్టు పంటకు రక్షణగా రైతులు మొక్కజొన్న చేను చుట్టూ పాత చీరలతో ప్రహరీలా కట్టేశారు. అటుగా వెళ్లే వారికి కండెలు కనిపించకుండా ఉంచడంతో పాటు, పశువులు పాడు చేయకుండా ఇది ఉపయోగపడుతుంది. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరు గ్రామంలో కనిపించిన దృశ్యమిది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పలు అభివృద్ధి పనులకు తీర్మానం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ సర్నాల గంగారత్నం అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులను పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. తొలుత పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అజెండాలోని అంశాలను పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈనెలతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల టెండర్ ముగుస్తుండటంతో నూతన టెండర్ ఆహ్వానానికి పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. మైమార్ట్ సమీపంలోని వాటర్ ట్యాంక్ మరమ్మతులు, మోటారు బోర్ల మరమ్మతులు, తాగునీటి కుళాయిల వద్ద ప్లాట్‌ఫామ్‌లు, డ్రెయిన్ల పూడికతీత పనులు తీర్మానం పొందాయి. కాగా ఎస్సీ కాలనీలో రహదారుల అభివృద్ధిపై ఎంపీటీసీ సభ్యుడు దూరు రత్నం, సర్పంచ్ భర్త, వార్డు సభ్యుడు సర్నాల బాలాజీ మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఉపసర్పంచ్ గూడవల్లి నరసయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాట్సాప్ సేవలు వినియోగించుకోండి

ఉయ్యూరురూరల్: ప్రభుత్వ వాట్సాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వాట్సాప్ సేవలను ప్రారంభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజల సమస్యలు వివరించేందుకు వాట్సాప్ క్యూఆర్ కోడ్ స్కానర్ డిస్ప్లే చేయడం జరిగిందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లోని రాజమాత ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పీ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పోరంకి-నిడమానూరు ప్రాంతంలోని కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వివాహిత, ఇద్దరు పిల్లలు అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో వివాహిత, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్‌నగర్ రోడ్డుకు చెందిన బండారి గౌరీశంకర్ భార్య బండారి ఆదిలక్ష్మి, కుమార్తె(14), కుమారుడు(11)తో కలిసి ఉంటున్నారు. అయితే భార్యభర్తకు మధ్య గొడవ జరగడంతో భార్య, ఇద్దరు పిల్లలను తీసుకొని ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్య పిల్లల కోసం భర్త బంధువుల ఇళ్లల్లో, అనేక ప్రాంతాల్లో వెతికినా వారి ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ప్రజాదర్బార్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పీ భవానిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడెప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. ప్రజలు ప్రజాదర్బార్‌లో పాల్గొని వారి సమస్యలు తెలపాలని కమిషనర్ కోరారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీకి ఆస్తి పన్ను బకాయి పడిన వారు ఏకకాలంలో మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తామని కమిషనర్ పీ భవానిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు బకాయి పడిన వారికి రెండు శాతం వడ్డీ పడుతుందన్నారు. ఇప్పటికే వడ్డీతో పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ సొమ్ము వచ్చే ఆర్థిక సంవత్సరం పన్నుల్లో మినహాయిస్తామని స్పష్టం చేశారు.

సబ్సిడీతో మినుము విత్తనాలు

పెనమలూరు: వేసవిలో అపరాల సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీతో మినుము, పెసల విత్తనాలు ఇస్తామని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. పోరంకి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో శైలజ మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారానే మినుము, పెసలు విక్రయించాలని అన్నారు. సీఎం యాప్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకుంటే మినుము, పెసలు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవచ్చని తెలిపారు. 2024-25 పంట నమోదు ప్రక్రియ ముగిసినందున రైతులు జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ స్మైలీ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు అవ్వడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మేరీమాత చర్చి సమీపంలో ఉండే ఎ.జగన్‌మోహన్‌రావు విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి దాటుతుండగా అతడిని మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడి కాలు విరిగింది. అతడిని చికిత్సకై పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు రీసర్వేపై గ్రామ సభ

ఉంగుటూరు: పెద్ద అవుటపల్లిలో గురువారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విమల కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్వో కార్యాలయ ఆవరణలో గురువారం రీసర్వేకు సంబంధించిన 9(2) నోటీసులు గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ప్రతి రైతు వారి భూమి యొక్క కొత్త ఎల్‌పీఎం విస్తీర్ణం సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే అప్పీల్ పిటిషన్ ఇస్తే సర్వే బృందాలు మరల భూమిపై సర్వే చేసి నిర్ధారిస్తారని వివరించారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా నిరసన

ఉయ్యూరు: మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉయ్యూరు పట్టణంలోని లంబాడిపేటలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బీ కీర్తి మాట్లాడుతూ జి కొండూరు బాలికను కిడ్నాప్ చేసి గన్నవరం ఏరియాలో అత్యాచారం చేయడం దారుణం అన్నారు. మైనర్ బాలిక పట్ల అమానుషంగా వ్యవహరించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మల్లమ్మ, వీరమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.